

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. నగరంలోని ఎల్‌బిఎస్ కాలనీ, దమ్మలవీధి, గుజరాతీపేటలో సిసి రోడ్లను, ఆదివారంపేటలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వాలు కషి చేయాలని, అదే తాము చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, వైసిపి నాయకులు సాధు వైకుంఠరావు, చల్లా శ్రీనివాస్, అంధవరపు ప్రసాద్, సంతోష్, పైడి రాజారావు తదితరులు పాల్గొన్నారు.



'ఉపాధి'కి కోత

- ఆధార్ బేస్డ్ పేమెంట్ అమలుకు కేంద్రం శ్రీకారం
- ఆధార్ అనుసంధానంలో సాంకేతిక ఇబ్బందులు
- జిల్లాలో 7.38 లక్షలకు గానూ 6.12 లక్షల మంది వివరాలే నమోదు
- 1.26 లక్షల మంది ఉపాధికి దూరం

నిరుపేదలకు ఆసరాగా నిలుస్తున్న ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం పలురూపాల్లో తూట్లు పొడుస్తూ వస్తోంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సాంకేతిక పరిజ్ఞానం పేరుతో ఉపాధి కుదింపు చర్యలు మొదలుపెట్టింది. ప్రజలు వ్యతిరేకిస్తున్నా ఉపాధి హామీకి ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టమ్‌ను ఈనెల ఒకటో తేదీ నుంచి అమలు చేసేందుకు సిద్ధమైంది. నేషనల్ పేమెంట్ ఇండియా లిమిటెడ్ ద్వారా కూలీలకు వారి ఖాతాల్లో డబ్బులు వేసేందుకు గతేడాది కాలంగా ప్రయత్నాలు సాగిస్తూనే ఉంది. ప్రభుత్వం అనుకున్న పని నెరవేరడంతో అమలుకు సిద్ధమైంది. దీంతో జిల్లాలో లక్ష మందికి పైగా కూలీలు ఉపాధి కోల్పోనున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం నిర్వీర్యం చేసే విధానాలను అవలంభిస్తూ వస్తోంది. తొలుత యాక్టివ్ వర్కర్లతో పేరుతో కుదింపు చర్యలు మొదలుపెట్టింది. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో 2015-16 ఆర్థిక సంవత్సరంలో పది లక్షల మంది వరకు జాబ్‌కార్డులను జారీ చేశారు. తర్వాత వీరిలో చురుగ్గా పనిచేసే కూలీల సంఖ్యను విడగొట్టి కొత్త జాబితాను తయారు చేయాలని కేంద్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. పనుల్లేక వలసలు వెళ్లిన కూలీలు, వేర్వేరు పనుల్లోకి వెళ్లిన కూలీలను తొలగించి యాక్టివ్ వర్కర్స్ పేరుతో కొత్త జాబితాను రూపొందించింది. ఆవిధంగా జిల్లాలో పది లక్షల మంది ఉన్న కూలీల సంఖ్యను 7.38 లక్షలకు కుదించారు. 2020-21 వరకు ఉపాధి హామీ పనులకు రాష్ట్ర ప్రభుత్వం టిసిఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) టెక్నాలజీని వినియోగించేది. దేశవ్యాప్తంగా ఒకటే విధానం ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో 2021-22 నుంచి ఏపిని కూడా ఎన్ఐసి (నేషనల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) పరిధిలోకి తీసుకొచ్చింది. ఆ క్రమంలో కూలీలు కొన్ని సౌకర్యాలను కోల్పోయారు. ఫిబ్రవరిలో అదనంగా 20 శాతం, మార్చిలో 25శాతం, ఏప్రిల్, మేలో 30 శాతం, జూన్‌లో 20 శాతం చొప్పున చెల్లించేవారు. ఎండలతో భూమి గట్టిపడడం, వేసవిలో పెరిగే ఉష్ణోగ్రతల్లో పనిచేయడం కష్టంగా ఉంటుందని వేసవిభత్యం కింద అదనంగా చెల్లించేవారు. 2021-22 నుంచి దాన్నీ ఆపేశారు. కూలీలకు గతంలో మజ్జిగ కోసం రోజుకు రూ.5 చొప్పున అదనంగా చెల్లించేవారు. రెండేళ్లుగా దాన్నీ ఆపేశారు. సాధారణ రోజుల్లో తాగునీటి కోసం రూ.5 చొప్పున చెల్లించే విధానాన్నీ నిలిపేశారు.

ఉపాధికి 1.26 లక్షల మంది దూరం

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కూలీలకు తానే డబ్బులు చెల్లిస్తూ వస్తోంది. ఇకపై చెల్లింపులన్నీ తానే చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా చెల్లింపు బాధ్యతలను నేషనల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పిసిఐఎల్)కు అప్పగించింది. వారు కూలీలకు సంబంధించిన వివరాలతో పాటు బ్యాంకు ఖాతా, ఆధార్ నంబర్లను సేకరించారు. ఈ ప్రక్రియలో ఆధార్ నంబరుకు, ఎన్‌పిసిఎల్‌కు లింకు కుదరలేదు. దీంతో బ్యాంకు ఖాతాతో ఉన్న ఆధార్ నంబరును ఒకసారి తొలగించి, కొత్తగా లింక్ చేయించాలని అధికారులకు సూచించింది. ఫీల్డ్ అసిస్టెంట్లు ఆ పని చేయించినా చాలాచోట్ల కుదరలేదు. లింక్ కాని వారితో పోస్టల్ ఖాతాలనూ తెరిచారు. అయినా ఫలితం కనిపించకపోవడంతో విడిచిపెట్టేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే జిల్లాలో 7.38 లక్షల మంది కూలీలు ఉండగా 6.12 లక్షల మంది కూలీల వివరాలు మాత్రమే లింక్ అయ్యాయి. వీరిలో ఆధార్ లింక్ కాని వారు, వలసలు వెళ్లిన వారి వివరాలు అనుసంధానం కాలేదు. ఆధార్ అనుసంధనం లేకపోవడంతో వీరంతా ఉపాధి పనులకు దూరంగా కానున్నారు. అధికారులు వాస్తవాలను దాచి 6.12 లక్షల మంది వివరాలనే పరిగణనలోకి తీసుకున్నారు. అప్‌డేట్ అవుతున్న 216ను మినహాయించి 99 శాతానికి పైగా అనుసంధానం పూర్తయినట్లు లెక్కలు చెప్తున్నారు.

చెల్లింపులే అసలు సమస్య

ఇప్పటివరకు కొత్త విధానం ద్వారా కూలీలకు ఇంకా చెల్లింపులు ప్రక్రియ మొదలు కాలేదు. డబ్బులు ఖాతాలో వేస్తే ఎంతమందికి జమ అయ్యాయో, ఎంతమందికి కాలేదో తెలుస్తోంది. జిల్లాలో ఉపాధి హామీ పనులు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. జిల్లాలో 910 పంచాయతీలు ఉండగా 678 పంచాయతీల్లో పనులు మొదలయ్యాయి. ఉపాధి పనులకు ప్రస్తుతం 39,992 మంది కూలీలు వస్తున్నారు.

ప్రజలందరికీ 'ఆరోగ్య సురక్ష'

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - గార

ప్రజల ఆరోగ్య సమస్యలకు వారి ఇంటి ముంగిట్లోనే పరిష్కారాన్ని, వైద్య సేవల్ని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మండలంలోని అంపోలు-3 సచివాలయ పరిధిలోని వెల్‌నెస్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది నవంబరు, డిసెంబరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. రోగులకు అవసరమైన సందర్భాల్లో నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసి ఉచిత వైద్య సేవలు అందిస్తారని, ఈ బాధ్యతను పూర్తిగా ఫ్యామిలీ డాక్టర్, సిహెచ్‌ఒలు, ఎఎన్ఎంలకు అప్పగించామని వివరించారు. ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహించే రెండో దశలో జిల్లాలోని దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలతో పాటు ప్రసవానంతర శిశు సంరక్షణ సేవలు, అన్ని వయసుల వారి ఆరోగ్య సమస్యలకు వైద్య సేవలను అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, అగ్రి మిషన్ సభ్యులు గొండు రఘురాం, వైద్యారోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉరితాళ్లతో ఉరి వేసుకుంటూ నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉరితాళ్లతో వినూత్న నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమగ్ర శిక్ష, విద్యాశాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 18వ రోజుకు చేరింది. నగరంలోని జ్యోతిరావు పూలే పార్కు వద్ద సమ్మె శిబిరంలో ఉరితాళ్లతో ఉరి పోసుకుని ఉద్యోగులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎం.వాగ్దేవి మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే ఉద్యోగులు సమ్మెబాట పట్టారని తెలిపారు. యుటిఎఫ్ నాయకులు ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు పనిభారం తగ్గించడంతో పాటు వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. సమగ్ర శిక్ష జిల్లా జెఎసి అధ్యక్షులు పైడి మురళీకృష్ణ మాట్లాడుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు ఆకలి మంటలతో అలమటిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జెఎసి ప్రధాన కార్యదర్శి తవిటినాయుడు, కోశాధికారి డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గిరిధర్, దేవి, రావాడ అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములపై హక్కులు కల్పించండి

తహశీల్దార్‌ను కోరిన తోటాడ రైతులు



తహశీల్దార్‌ను ప్రశ్నిస్తున్న రైతులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని తోటాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 121లోని భూములపై హక్కులు కల్పించాలని తహశీల్దార్ ఎస్.గణపతిరావును సాగు రైతులు కోరారు. తోటాడ గ్రామంలో సర్పంచ్ మెట్ట శారద ఆధ్వర్యాన సమగ్ర భూ రీ సర్వేపై మంగళవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సభకు పెద్ద సంఖ్యలో హాజరైన రైతులు తాము పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. గ్రామానికి చెందిన తాండ్ర రామారావు, తాండ్ర ప్రకాష్ మాట్లాడుతూ మూడు తరాలుగా గ్రామానికి చెందిన 2,200 మంది రైతులు సర్వే నంబరు 121లోని 199 ఎకరాల వ్యవసాయ భూములను సాగు చేస్తున్నారని గుర్తుచేశారు. ఈ భూములను ఇనాం భూములుగా చూపిస్తూ ప్రభుత్వం మారిన ప్రతిసారీ రైతులను మనోవేదనకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత రీ సర్వేలోనైనా జిరాయతీ భూములుగా గుర్తించి, పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. 1961, 1994లో అప్పటి ప్రభుత్వాలు రెండుసార్లు సర్వే చేపట్టాయని అడంగల్, ఎఫ్ఎంబిలో రైతులు నమోదై ఉన్నారని తెలిపారు. రికార్డులను మాయం చేసి అప్పటి అధికారులు రైతులకు అన్యాయం చేశారని వాపోయారు. గత టిడిపి ప్రభుత్వం చుక్కల భూమిగా నమోదు చేసిందని, వైసిపి ప్రభుత్వం అదే రీతిలో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తహశీల్దార్ గణపతిరావు మాట్లాడుతూ భూ సర్వేతో నాలుగు నెలల్లో రైతులకు న్యాయం జరుగుతుందని హామీనిచ్చారు. ఈలోగా ఎన్నికల కోడ్ వస్తే తమ పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నించారు. ఎన్నికల నిబంధనలు కొత్త పథకాల మంజూరుకు వర్తిస్తాయని, ప్రస్తుతం జరుగుతున్న సర్వేకు వర్తించదని తహశీల్దార్ బదులిచ్చారు. ఒకవేళ ప్రభుత్వమే మారితే సర్వే పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నించగా, వచ్చే ప్రభుత్వ విధివిధానాలపై ఆధారపడి ఉంటుందని తహశీల్దార్ తెలిపారు. రైతులకు న్యాయం చేస్తామని, అపోహలు వీడి రీ సర్వేకు సహకరించాలని కోరారు. సభలో భూ సర్వే డిటి కిరణ్ కుమార్, ఆర్ఐ శిరీష, సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, రైతులు పొన్నాడ గణపతిరావు, తాండ్ర శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన స్పెషల్ ఫీజులు తగ్గించాలి



ధర్నా చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పేద విద్యార్థులకు గుదిబండగా మారిన డిగ్రీ స్పెషల్ ఫీజుల పెంపును ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై నగరంలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెంచిన స్పెషల్ ఫీజులను వెంటనే రద్దు చేసి విద్యార్థులకు ఊరటనివ్వాలన్నారు. విద్య ఒఎస్‌పి యాప్ ద్వారా ఫీజులు కట్టడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం అమల్లో భాగంగా పేదలను చదువుకు దూరం చేస్తున్నారని, మార్పుల పేరుతో ఉన్నత విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని విమర్శించారు. కళాశాల అభివృద్ధి పేరిట విద్యార్థుల నుంచి స్పెషల్ ఫీజుల రూపంలో వసూలు చేయడం దారుణమన్నారు. కళాశాల అభివృద్ధికి ప్రభుత్వమే నిధులు ఇవ్వాలన్నారు. పెద్ద మొత్తంలో ఫీజులు పెంచడం వల్ల పేద విద్యార్థులు చెల్లించలేక చదువులకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. స్పెషల్ ఫీజులు వెంటనే రద్దు చేయకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సురేఖకు వినతిపత్రం అందజేశారు.

బెదిరింపులకు తలొగ్గం

- సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె
- స్పష్టం చేసిన అంగన్వాడీలు
- నేడు కలెక్టరేట్ వద్ద బైఠాయింపు



శ్రీకాకుళం అర్బన్ : దున్నపోతుకు వినతిపత్రం ఇస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇచ్చిన హామీలను అమలు చేయాల్సింది పోయి, విధులకు హాజరు కాకుంటే చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం బెదిరిస్తే భయపడేది లేదని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ అన్నారు. అంగన్వాడీలపై బెదిరింపులను మానుకొని సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమ్మెలో భాగంగా బుధవారం కలెక్టరేట్ వద్ద బైఠాయించనున్నట్లు తెలిపారు. పెద్దసంఖ్యలో అంగన్వాడీలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 22వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద 22 రోజులుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడానికి నిరసనగా దున్నపోతుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, టి.రాజేశ్వరి, కె.ప్రమీలాదేవి తదితరులు పాల్గొన్నారు. పొందూరులో ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలిపారు. సమ్మెకు యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు పొందూరు అప్పారావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.జ్యోతిలక్ష్మి, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు. కొత్తూరులో సమస్యల పరిష్కారం కోరుతూ అన్ని సచివాలయాల్లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు ధనలక్ష్మి, జలజాక్షి తదితరులు పాల్గొన్నారు. మెళియాపుట్టిలో సమస్యలు పరిష్కరించాలని సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.శాంతామణి, సుధారాణి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు. ఆమదాలవలసలో అంగన్వాడీలను ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి మాట్లాడారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు పంచాది లతాదేవి, పి.భూలక్ష్మి, మొదలవలస లత తదితరులు పాల్గొన్నారు. ఎచ్చెర్లలో సమ్మె శిబిరాన్ని సిఐటియు ఆవిర్భావ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసు సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు వై.విజయలక్ష్మి, బి.కనకం తదితరులు పాల్గొన్నారు. టెక్కలిలో సమ్మెకు పెన్షనర్ల సంఘం నాయకులు బొడ్డేపల్లి మోహనరావు, పలు సంఘాల నాయకులు ఎన్.షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్య, పి.సాంబమూర్తి, కుప్పిలి కామేశ్వరరావు సంఘీభావం తెలిపారు. పలాసలో కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు నుంచి అంగన్వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం పంపిణీ చేసేందుకు ఐసిడిఎస్ అధికారులు తీసుకెళ్తున్న వ్యాన్‌ను అంగన్వాడీలు అడ్డుకున్నారు. తాము లేకుండా అంగన్వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం ఎలా పంపిణీ చేస్తారంటూ అధికారులను నిలదీశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని వ్యాన్‌ను విడిచిపెట్టేందుకు ప్రయత్నించగా వారికి, అంగన్వాడీలకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి జోక్యం చేసుకోవడంతో వ్యాన్‌ను విడిచిపెట్టారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

కోటబొమ్మాళిలో సమ్మె శిబిరానికి ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ చేరుకుని సమ్మె విరమించాలని కోరారు. ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, ఐదో తేదీ లోగా విధులకు హాజరు కాకుంటే చర్యలు తప్పవన్నారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ స్పష్టం చేయడంతో ఆమె వెనుదిరిగారు. ఇచ్ఛాపురంలో సమ్మె శిబిరం వద్దకు వచ్చిన ఐసిడిఎస్ పిఒ నాగరాణి సమ్మె విరమించాలని కోరగా, సమస్యలు పరిష్కరించే వరకు విరమించేది లేదని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు హైమ తదితరులు స్పష్టం చేశారు.


బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి- కంచిలి

క్రీడల వల్ల శారీరక దారుఢ్యం పెరగడమే కాకుండా మానసికోల్లాసం కలుగుతుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని బూరగాంలో మంగళవారం క్రికెట్ టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఇటువంటి పోటీలు క్రీడాకారుల ప్రతిభను వెలికి తీస్తాయన్నారు. ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బొడ్డు అప్పారావు, నాయకులు దాసరి రాజు, మాదిన రామారావు, ఎం.ఎం.పట్నాయక్, టి.వి.రమణ, ఎం.ఆనందరావు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాలతో క్రీడాకారులు

ముగిసిన బాస్కెట్‌బాల్ టోర్నీ

శ్రీకాకుళం అర్బన్ : మూడు రోజులపాటు కన్నుల పండువలగా సాగిన నగర పరిధి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. డిసెంబరు 30 నుంచి మూడు రోజులపాటు నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానం వేదికగా ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు మంగళవారం శ్రీకాకుళం డిటి బి.వి.వి.ఎన్.రాజు, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి బహుమతులు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. టోర్నీలో భాగంగా 10 నుంచి 18 ఏళ్ల విభాగంలో బ్లెస్సింగ్ బ్లూస్ విజేతగా నిలవగా, బ్లాక్ బుల్స్ రన్నరప్‌గా, రెడ్ రైడర్స్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. పదేళ్లలోపు వయో విభాగంలో చార్మింగ్ బ్లూస్ విన్నర్‌గా, ఆరెంజ్ వారియర్స్ జట్టు రన్నరప్ నిలిచారు. వీరితోపాటు మినీ క్యాడేట్స్ కూడా ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహించి పతకాలు అందజేశారు. ఈ వేడుకల్లో కోచ్ అర్జున్‌రావురెడ్డి, అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వి.డి.మురళి, బి.సోములు, వేణుగోపాల్, రోజా, కళావతి, గణేష్, రమణ పాల్గొన్నారు.

అలరించిన డాన్స్ పోటీలు

పలాస : మండలంలోని గురుదాసుపురంలో స్వామి వివేకానంద యూత్ అధ్వర్యాన ఉత్తరాంధ్ర డాన్స్ బేబీ డాన్స్ పోటీలు మంగళవారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి డాన్స్ గ్రూపులు పోటీలో పాల్గొనగా కొరియోగ్రాఫర్ అమిత్ మాస్టర్, కుమార్ మాస్టర్, రాజా తాతారావులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ పోటీల్లో ప్రథమ విజేతకు రూ.పది వేలు, ద్వితీయ విజేతకు రూ.ఆరు వేలు, తృతీయ బహుమతిని రూ.4 వేలు నగదు అందజేశారు. అనంతరం ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుత్తుం రూపవతి, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, సొర్ర ఢిల్లీరావు, అభివృద్ధి కమిటీ అధ్యక్షులు దున్న తారకేశ్వరరావు, స్వామి వివేకానంద యూత్ పెడరేషన్ అధ్యక్షులు సొర్ర ప్రేమ్‌కుమార్, అమరావతి ధాబా యజమాని కరగాన ప్రతాప్, కామేష్ పాల్గొన్నారు.


ట్రోఫీని అందజేస్తున్న సభ్యులు

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసనలు


శ్రీకాకుళం అర్బన్ : అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాంలు హెచ్చరించారు. నగరంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు మంగళవారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పలాస మున్సిపాలిటీలో కార్మికులంతా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని విమర్శించారు. ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీలు ప్రకారం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కళ్యాణ, రాజు, ఆకుల శంకర్, అరుగుల రాము, ఎ.శేఖర్, బి.గణేష్, డి.సురేష్ కుమార్, ఎన్.పార్వతి, ఆర్.ఈశ్వరమ్మ, డి.లక్ష్మి పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద పారిశుధ్య కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం ఒంటి కాలిపై నిల్చొని ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. దీక్షనుద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తారని అన్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తరపున సమ్మెకు మద్దతిస్తున్నట్లు అంగన్వాడీ నాయకులు పంచాది లతాదేవి తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మిక నాయకులు తాడి సంతోష్, తారకేశ్వరరావు, జె.శ్రీను, జె.ఈశ్వరరావు, జె.వాసు, ఎన్.రాజేష్ పాల్గొన్నారు.


ఆమదాలవలస : ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు


ఇచ్ఛాపురం : విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఇచ్ఛాపురం : మున్సిపాల్ పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మె లో భాగంగా ఆర్అండ్‌బి బంగ్లా రోడ్డు నుంచి బస్టాండ్ వరకు నినాదాలు చేస్తూ... ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, రమేష్‌కుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.మురగన్, ఎం.రవి, దివాకర్, ఎస్.శంకర్, తిరుపతి, ప్రకాష్ ముఖి, సీతమ్మ, గులాబీ, సావిత్రి, లక్ష్మి పాల్గొన్నారు.

కాలువలు ఏర్పాటు చేయరూ...

ప్రజాశక్తి- బూర్జ


కాలువను నిర్మించాలని కోరుతున్న గ్రామస్తుడు

తమ గ్రామంలో కాలువలు లేకపోవడం వల్ల తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామని, తక్షణమే తమ గ్రామానికి కాలువలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సింగన్నపాలెం కోరారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఉప్పినివలస పంచాయతీ పరిధిలోని నామాలలక్ష్మీపురం, సింగన్నపాలెం గ్రామాల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే నిల్వ ఉంటుందని అన్నారు. దీనివల్ల వ్యాధులు ప్రబలి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. ముందుగా నామాలలక్ష్మీపురంలో రూ.26 లక్షలతో, సింగన్నపాలెంలో రూ.23 లక్షల నిధులతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయిలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్నేన నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపి కరణం కృష్ణంనాయుడు, బుడుమూరు సూర్యారావు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

నేడు యుటిఎఫ్ 12 గంటల ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆర్థిక సంబంధమైన బకాయిల విడుదలకు యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉద్యమిస్తామని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ ప్రభుత్వానికి హెచ్చరించారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు అధ్యక్షతన మంగళవారం సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టరేట్ వద్ద బుధవారం 12 గంటల ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, డి.రవికుమార్, జిల్లా కార్యదర్శి హనుమంతు అన్నాజీరావు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వం అందిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలు ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండపల్లి సర్పంచ్ పిట్ట శశిరేఖ అన్నారు. మండలంలోని మండపల్లిలో ఏర్పాటు చేసిన అరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఇంటి ముందుకే వచ్చిన ఈ సదవకాశం వినియోగించుకోవాన్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రతిఒక్కరికీ వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రవేశ పెట్టారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, ఎంపిడిఒ ఈశ్వరరావు, కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు కె.మోహనరావు, పిట్ట మామయ్య, పి.పేరయ్య, వెంకటేష్, వల్లభరావు, బర్రి బాబయ్య, కార్యదర్శి నీలాపు శ్రీను, కౌన్సిలర్ బచ్చ జగన్, వైద్యులు దేవేంద్రరెడ్డి, అనూష పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: ప్రతి ఒక్కరికి ఖరీదైన వైద్యాన్ని అందుబాటులోకి సిఎం జగన్ తీసుకొచ్చారని సచివాలయం మండల కన్వీనర్, డోకులపాడు సర్పంచ్ వడ్డీ కరుణాకర్ అన్నారు. ఈ మేరకు గ్రామంలో జగన్ ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, ఎంపిటిసి దిల్లేశ్వరరావు, కార్యదర్శి కొర్రాయి యాదవ రాజు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : ప్రారంభిస్తున్న సర్పంచ్ శశిరేఖ

పొందూరు: మండలంలోని కనిమెట్టలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సచివాలయ నోడల్ అధికారి వాసుదేవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా 332 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.లక్ష్మి, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, వైద్యాధికారి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ మిషన్ జిల్లా ఉపాధ్యక్షులుగా స్టాలిన్

ప్రజాశక్తి- టెక్కలి


స్టాలిన్

స్థానిక కళాకారుడు, నటుడు, దర్శకుడు డి.ఎ.స్టాలిన్‌కు హ్యూమన్ రైట్స్ మిషన్ జిల్లా ఉపాధ్యక్షునిగా నియమించారు. హ్యూమన్ రైట్స్ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కుమార్‌నాయక్, జూనియర్ సివిల్ విశ్రాంత జడ్జి ఎస్.ప్రభాకర్ చేతులు మీదుగా స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంక్షేమ సంఘం ఆవరణలో మంగళవారం స్టాలిన్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. హ్యూమన్ రైట్స్ మిషన్ జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.జి.కుమార్, జిల్లా అధ్యక్షులు వంగా మహేష్, మిషన్ కార్యదర్శి కృష్ణబాబు, పెన్షనర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ రామకృష్ణ, టెక్కలి పెన్షనర్స్ సంక్షేమ సంఘం కార్యదర్శి ధనుంజయ, సబ్ ట్రెజరీ ఆఫీసర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని టి.ఆర్.రాజంపేట కూడలి వద్ద మంగళవారం ఆర్‌టిసి బస్సు ఢీకొని సుంకరాడకు చెందిన తోట సత్యనారాయణ గుండ్రు శ్రీరామ్ గాయపడ్డాడు. వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై కొల్లివలస వెళ్లారు. పనులు ముగించుకుని స్వగ్రామానికి వస్తుండగా... ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న స్థానికులు వచ్చి బస్సును అడ్డుకుని ఆందోళన చేపట్టారు. గాయపడిన వారికి న్యాయం చేసేంతవరకు బస్సులను కదలనియమని పట్టుబట్టారు. దీంతో గంట సమయం ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పాలకొండ ఆర్‌టిసి డిపో మేనేజర్ స్పందించి సూపర్‌వైజర్‌ను ప్రమాద స్థలానికి పంపించారు. ఎస్ఐ అశోక్‌బాబు, సూపర్‌వైజర్ చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీనివ్వడంతో వెంటనే క్షతగాత్రులను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

జూదరుల అరెస్టు

ఆమదాలవలస : మండలంలోని అక్కులపేట మామిడి తోటలో పేకాట శిబిరంపై జిల్లా కేంద్రానికి చెందిన టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎనిమిది మంది పేకాట రాయుళ్లు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ. 1,2,230 నగదును టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాలుగు ద్విచక్ర వాహనాలు, 9 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఎస్ఐ వై.కృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు బైక్‌ల చోరీ

ఆమదాలవలస : పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన వేర్వేరు వ్యక్తుల ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. పట్టణంలోని 15వ వార్డు గణేష్ నగర్‌కు చెందిన ట్రెజరీ ఉద్యోగి బెండి మోహనరావు బుల్లెట్, అదే వార్డు పాతిన వారి వీధికి చెందిన పేడాడ రామకృష్ణకు చెందిన బైక్, అలాగే వేర్వేరు ప్రాంతాల్లో మరో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. ఎస్ఐ వై.కృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

నౌపడ : సంతబొమ్మాళి మండలం వడ్డితాండ్రకు చెందిన బాలిక అదృశ్యమైనట్లు నౌపడ ఎస్ఐ పి.కిశోర్‌శర్మ మంగళవారం తెలిపారు. బాలిక గతనెల 30 బంధువుల ఇంటికి వెళ్తానని చెప్పి బయటకు వెళ్లిందన్నారు. రాత్రయినా అక్కడి, ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో, చుట్టు పక్కల గ్రామాల్లో వాకబు చేశారని, ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

రోడ్ల ఎత్తు పెంచాలని వినతి

శ్రీకాకుళం అర్బన్ : నగరపాలక సంస్థ పరిధిలో విలీన పంచాయతీ అయిన ఇందిరా నగర్ కాలనీ నుంచి డగ్లస్ స్కూల్ రోడ్డులో ఉన్న కల్వర్టుకు ఇరువైపులా డ్రెయినేజీ, రోడ్లు ఎత్తు పెంచాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ బి.కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందిరానగర్ కాలనీ నుంచి గోవింద్ నగర్, విశాఖ-బి కాలనీలకు వెళ్లాలంటే ఇదే ప్రధానమైన దారని అన్నారు. ఈ రోడ్డు లోతవడంతో చిన్నపాటి వర్షానికే నీరు రోడ్డుపై చేరుతోందని వివరించారు. అందువల్ల ఈ రోడ్డును పరిశీలించి ఎత్తు పెంచడానికి చర్యలు చేపట్టాలని కోరారు.

సచివాలయాలతో పారదర్శక పాలన

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సచివాలయాలతోనే పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని బెలమాంలో రూ.40 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని అన్నారు. సచివాలయాల వ్యవస్థ ఏర్పడిన నాటినుంచి అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కనుగుల కిషోర్, వైసిపి నాయకులు పంచాది పాపారావు, బెండి గాంధీ, పొందూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాడాన సునీల్, గురుగుబెల్లి నీలారావు, సోమరాజు తేజ పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ సీతారాం


మాట్లాడుతున్న 'గుండ' దంపతులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రాభివృద్ధి నారా చంద్రబాబు వల్లే సాధ్యమవుతుందని మాజీ మంత్రి గుండ అప్పల సూర్య నారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలు పేర్కొన్నారు. నగరంలోని అరసవల్లిలో ఉన్న వారి స్వగృహంలో మంగలవారం విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్ల పరిపాలన విధానం, నేటి జగన్మోహనరెడ్డి దాష్టీకాన్ని ప్రజలు బేరీజీ వేసుకోవాలన్నారు. రాష్ట్రంలో అశాంతి, అలజడి, ధరాబారం, విధ్వంసం, ప్రత్యర్థులను వేధించడం జగన్ నైజమని విమర్శించారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలు అనేక రకాలైన కష్టాలు పడ్డారని, సంక్షేమం పేరుతో ప్రజల కళ్లకు గంతలు కట్టి రాష్ట్రాన్ని దోచుకున్నారని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు నాయకత్వం అవసరమని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా ముక్తకంఠంతో చంద్రబాబు- పవన్ కళ్యాణ్ జోడికి అండగా నిలుస్తారన్నారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు


మస్టరు పుస్తకాన్ని పరిశీలిస్తున్న ఎపిఒ కేశవరావు

ఉపాధి కూలీలకు బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరని ఉపాధిహామీ ఎపిఒ పిట్ట కేశవరావు అన్నారు. మండల కేంద్రానికి వెనుక ఉన్న బారికిబంద చెరువులో రూ.6 లక్షల అంచనాలతో చేపడుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ నెల 1 నుంచి ప్రతి కూలీ ఆధార్ కార్డు అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు మాత్రమే డబ్బులు జమవుతాయని అన్నారు. కూలీల వేలిముద్రలు అప్‌డేట్ కాని పక్షంలో వారి ఖాతాల్లో కూలి డబ్బులు జమ కావని తెలిపారు. టెక్నికల్, క్షేత్ర సహాయకులు ఇచ్చిన కొలతల మేరకు పనిచేసి పూర్తిస్థాయిలో కూలీలు పొందాలని సూచించారు. మండలంలో ప్రస్తుతం 955 మంది పనిచేస్తున్నారని చెప్పారు. అనంతరం మాస్టర్ పుస్తకాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు టెక్నికల్ అసిస్టెంట్ దాసరి జయరాం, డిఎఫ్‌టి ప్రకాశరావు ఉన్నారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని లింగాలవలసలో పశువుల గాలి కుంటూ వ్యాధికి టీకా కార్యక్రమానికి టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త దువ్వాడ వాణి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు అరోగ్య మే కాకుండా పశువుల కూడా అరోగ్యం చూచికుండే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంన్నారు. జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎం.కిషోర్ మాట్లాడుతూ ఈ గాలి కుంటూ వ్యాధి లక్షణాల అధిక జ్వరం, నోటి నుంచి చొంగ కారడం, కాలి గిట్టల మధ్య పుండ్లు, పశువు నీరశించడం, పాలు దిగుబడి తగ్గడం జరుగుతుందన్నారు. ఈ వ్యాధి రాకుండా ముందుస్తుగా ఈ టీకాలు వేస్తున్నామని తెలిపారు. కార్యక్ర మంలో ఎంపిపి ఆట్ల సరోజినమ్మ, సర్పంచ్ సంపతిరావు లక్ష్మి, ఎంపిటిసి శ్రీలత, డిప్యూటీ డైరెక్టర్ వి.జయరాజ్, ఎడి ఆర్.కిషోర్, జి.రఘునాథ్, పశు వైద్యాధికారి ఎం.పూర్ణచంద్రరావ, డాక్టర్ కె.జె.చక్రవర్తి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి పంచాయతీ లక్ష్మీపురంలో పశువులకు గాలికుంటు వ్యాధిటీకాల కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రతినిధి కళింగపట్నం అప్పారావు ప్రారంభించారు. ఈ మేరకు 86 పశువులకు పశువైద్యాధికారి కె.అప్పలసూరి టీకాలు వేశారు. కార్యక్రమంలో వీరస్వామి పాల్గొన్నారు.

జైభీమ్ సేన జిల్లా అధ్యక్షునిగా ఈశ్వరరావు


ఈశ్వరరావు

సోంపేట: జైభీమ్ సేన జిల్లా నూతన అధ్యక్షుడుగా బుష్యా ఈశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం సోంపేటలోని సంస్థ కార్యాలయంలో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు నగిరి మోహనరావు అధ్యక్షతన నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన సంస్థ వార్షికోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఫీజులు తగ్గించాలి

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు పెంచిన స్పెషల్ ఫీజులను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఉర్జాన దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. జెవిడి అకౌంట్‌లో పడిన తర్వాతే విద్యార్థులు ఫీజులు చెల్లిస్తారని స్పష్టం చేశారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హరీష్, తరుణ్, మహేష్, మానస తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

'ఉపాధి' పనులు ప్రారంభం

టెక్కలి : వలసల నివారణ దృష్ట్యా చేపట్టిన ఉపాధి పనులను జాబ్‌కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని బొప్పాయిపురం సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డి కోరారు. మండలంలోని బొప్పాయిపురంలో ఉపాధి హామీ పనులను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యాలయ కార్యదర్శిపాల రవి, సూర్యం, చందర్రావు, ఆనంద, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న పగడాలమ్మ

ఉత్తమ ఫలితాలు సాధించాలి

మెళియాపుట్టి : వచ్చే పదో పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ డిఇఒ పగడాలమ్మ సూచించారు. మండలంలో నడసంద్ర ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు తీసుకొచ్చి ఉపాధ్యాయులకు తల్లితండ్రులకు మంచి పేరు ప్రత్యేకతలు తేవాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. సమావేశంలో డిఇఒ ఎస్.దేవేందరరావు, మల్లారెడ్డి పద్మనాభరావు హెచ్ఎం ఎం.రమేష్ చౌదరి, ఉపాధ్యాయులు మిశ్రో, అతుల్య సంధ్య, రామలక్ష్మి, ధర్మారావు, సామల నాగేశ్వరరావు, అంజనాదాస్‌లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎపిడి శైలజ

వంద రోజుల పనే లక్ష్యం

సంతబొమ్మాళి: జనవరి నెలాఖరు నాటికి రెండు వేల మంది కుటుంబాలకు వంద రోజుల పనిదినాలు పూర్తి చేయాలని ఎపిడి ఎం.శైలజ అన్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.పది లక్షలతో అంచనాలు తయారు చేయాలన్నారు. 34 పంచాయతీల్లో పనులు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ వాసునాయుడు, ఇసి మునీంద్ర, టిఎ పి.నరసింహమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధ

ప్రతి కళాశాలలో టూరిజం క్లబ్

ఎచ్చెర్ల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి కళాశాలలో యువర్ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి టి.సుధ అన్నారు. స్థానిక అంబేద్కర్ గురుకులంలో యువ క్లబ్, పెర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల పరిసరాల్లో మొక్కలు నాటాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మి, ఎన్.నర్సింగరావు, వి.వి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

'చంద్రబాబు వస్తే వాలంటీర్ల తొలగింపు'

పలాస : టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే వాలంటీర్ల వ్యవస్థను తొలగిస్తారని వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పైల వెంకటరావు (చిట్టిబాబు) ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పలాస నియోజకవర్గం ఎలా ఉండేదో ప్రజలందరికీ తెలుసునని, సామాన్యుడు సమస్యను చెప్పుకోవాలంటే నాయకుడు దగ్గరకు వెళ్లలేని పరిస్థితి ఉండేదని అన్నారు. వారసత్వం రాజకీయాలతో ప్రజలపై అజమాయిషీ చెలాయించి అభివృద్ధి సంక్షేమం గాలికి వదిలేసి మోసం చేసే నాయకులు గత టిడిపి పాలకులని పేర్కొన్నారు.

అశోక్‌కుమార్ పాదయాత్రకు స్వాగతం

కోటబొమ్మాళి: టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేద్దామని టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ అన్నారు. చంద్రబాబు సిఎం కావాలని ఇచ్ఛాపురం నుంచి తిరుపతి వరకు పాదయాత్ర చేస్తున్న ఎపి రైతు ఎస్సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు చింత అశోక్ కుమార్ చేపట్టిన పాదయాత్ర సోమవారానికి కోటబొమ్మాళి చేరుకుంది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు స్వాగతం పలికారు. టిడిపి కార్యకర్తలు బొమ్మాళి ప్రసాదరావు, మజ్జి కృష్ణారావు, మెట్ట మోహనరావు, ముద్దబాబు పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కొత్తపొన్నుటూరులో ఉపాధి హామీ నిధులు రూ.21 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్‌హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజారోగ్యమే సిఎం జగన్ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు వస్తే హెల్త్ క్లినిక్‌లు ఉపయోగపడతాయన్నారు. అనంతరం జగన్న సురక్ష సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ వై.చామంతి, జెడ్‌పిటిసి కె.భాగ్యవతి, వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, ఎంపిడిఒ ఎం.పావని, వైసిపి జిల్లా కార్యదర్శి బి.శ్రీను, వైద్యులు ఎం.సందీప్, జానకిరామయ్య, ఇఒపిఆర్‌డి కృష్ణారావు కురిగాం సర్పంచ్ ఎస్.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి